నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | ఆదివారం 21 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




వాననీటితో నిండిన చిల్పూరు మండలం పల్లగుట్టలోని కొనుగోలు కేంద్రం

పంట చేతికొచ్చిన వేళ అకాల వర్షం రైతన్నను ఆగం చేసింది. వర్షానికి వ్యవసాయ మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. శనివారం ఉదయం ఉరుములు, గాలివానతో మొదలు కాగా ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపించగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వాన పడింది. కోత దశలో ఉన్న వరితో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొనుగోళ్లు ఆలస్యమై చాలాచోట్ల ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. మిగతా చోట్ల చిరుజల్లులు పడగా ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్లు, పరదాలు కప్పుతూ అన్నదాతలు నానా పాట్లు పడాల్సి వచ్చింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో నిన్నటివరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగింది.

– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 20

ధర్మసాగర్ : పీఏసీఎస్ సెంటర్‌లో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు



# అకాల వర్షం రైతన్న ఆగం..

## కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో తడిసిన ధాన్యం



వరంగల్ బస్‌స్టేషన్ ఎదుట నిలిచిన వర్షపు నీరు

నర్మెట : వెల్దండలో వరద నీటిలోంచి ధాన్యాన్ని ఎత్తిపోస్తున్న రైతు



**చేతికొచ్చిన పంట నీటి పాలు**

**కాపాడుకునేందుకు నానా పాట్లు**

**జనగామ జిల్లాలో ఎక్కువ ప్రభావం**

**మిగతా చోట్ల చిరుజల్లులు**

**ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం**

అకాల వర్షం జనగామ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. కోత దశలో ఉన్న వరి పంటలకు నష్టం వాటిల్లింది. జనగామ రూరల్ మండలం, లింగాలఘనపురం, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో మోస్తరు వాన కురవగా నర్మెటలో భారీ వర్షం కురిసింది. మామిడి కాయలు రాలి, కూరగాయలు, పండ్ల తోటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లింగాలఘనపురం మండలం నేలపోగులలో తాటిచెట్టుపై పిడుగు పడింది. జనగామ వ్యవసాయ మార్కెట్, చీటకోడూరు రోడ్డులోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం, బచ్చన్నపేట మండలంలోని కేంద్రాల్లోని ధాన్యం పాక్షికంగా తడిసింది.



కమలాపూర్ : ఉప్పల్‌లో తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతు వీరయ్య



నర్మెట : వరద ధాటికి వెల్దండ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో నీటి పాలైన ధాన్యం

హనుమకొండ జిల్లాలో మోస్తరు వాన కురిసింది. ఎల్కతుర్తి, ధర్మసాగర్, కమలాపూర్, ఐనవోలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిశాయి. అధికారులు కొనుగోళ్లు జాప్యం చేస్తుండడంతో ఎల్కతుర్తి మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పినా వరద నీరు చేరి వడ్లు తడిసిపోయాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వరి నేలవాలి గింజలు రాలిపోయాయి. ధర్మసాగర్‌లోని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేక ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపూర్ మండలకేంద్రంతో పాటు గూడూరు, ఉప్పల్, అంబాల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడుస్తుండడంతో రైతులు కవర్లు కప్పుకున్నారు. ఐనవోలు మండలంలోనూ అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వెంటనే కేంద్రాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



వరంగల్ ఎంజీఎం సెంటర్‌లో కురుస్తున్న వర్షం

# ఆ ఇద్దరూ ద్రోహులే..

**కడియం, అరూరిపై దళితుల ఆగ్రహం**

**బీఆర్ఎస్ వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్**

**హామీలు నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తావా**

**భూపాలపల్లి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి**

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)/ కృష్ణ కాలనీ : కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ఇద్దరూ పార్టీ ద్రోహులేనని వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ అన్నారు. వారికి కేసీఆర్ అన్ని విధాలా గుర్తింపు ఇచ్చినా పార్టీకి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డ ఆయన వారిపై దళితులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని.. ఈ ఎన్నికల్లో కడియం, అరూరికి బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. శనివారం భూపాలపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి హాజరయ్యారు.

**రుణమాఫీ చేస్తానని రాసివ్వు : మాజీ మంత్రి ఎర్రబెల్లి**

పథకాల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు వరకు గడువు పెట్టడాన్ని బట్టి ఎన్నికలు దాటవేయాలనే ఆలోచన ఉన్నట్లు అర్థమవుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని ఇప్పుడు మాట మార్చి, ఆగస్టుకు వాయిదా వేశాడన్నారు. దమ్ముంటే ఆగస్టులో రుణమాఫీ అమలు చేస్తానని రాసివ్వు.. మాఫీ చేయకుంటే ప్రభుత్వాన్ని రద్దు చేస్తానని రాసివ్వు అని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను ఓడించినందుకు ప్రజలు బాధపడుతున్నారని, వరంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తున్నట్లు కాంగ్రెస్ సర్వేలే చెప్తున్నాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై చేయి పడినా ఉరికించి కొట్టాలని, ఎవరైనా అక్రమ కేసులు పెడితే తాను కొట్లాడతానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ అన్నం పెట్టిన బీఆర్ఎస్‌కు సున్నం పెట్టిన రాజకీయ ద్రోహి కడియం శ్రీహరి అని మండిపడ్డారు. కడియం అంటే దళితులు, యువకులు మండిపడుతున్నారని, కావ్యను చిత్తుగా ఓడిస్తామని బహిరంగంగానే చెప్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పు కావాలన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఒక్క ఎకరం భూమి, ఒక్క కుంట ఎండిపోలేదని, రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కుంటలు, చెరువులు, వ్యవసాయ భూములు పూర్తిగా ఎండిపోయి కరువు తాండవిస్తున్నదన్నారు. భూపాలపల్లి జిల్లాను తీసేస్తానని అంటున్నావు, బిడ్డా.. రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లాను తీసేస్తే ఉరికిచ్చుకుంటూ కొడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ కడియం శ్రీహరి నిఖార్సయిన అవకాశవాదని, బీఆర్ఎస్‌లో అధికారం అనుభవించి ఇప్పుడు మోసం చేసి కాంగ్రెస్‌లో చేరిన నీచుడన్నారు. గండ్ర జ్యోతి మాట్లాడుతూ కేసీఆర్ విశ్వరూపం చూపిస్తే కాంగ్రెస్ భూస్థాపితమవడం ఖాయమన్నారు. మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి మాట్లాడుతూ ఇటీవలి సర్వేలో బీఆర్ఎస్ ఎనిమిది స్థానాల్లో గెలువబోతున్నదని, అందులో వరంగల్ ఎంపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలువబోతున్నాడన్నారు. మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులను సాధించిన బీఆర్ఎస్‌కు ఓటువేసి సుధీర్‌కుమార్‌ను గెలిపించి కేసీఆర్ రుణం తీర్చుకుందామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతిరావు, ఎంపీపీ మందల లావణ్యా సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, జడ్పీటీసీ గొర్రె సాగర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, నేతలు పోలుసాని నర్సింగరావు, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య, వేదికపై ఎమ్మెల్సీలు సిరికొండ, బస్వరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

## కడియం ఎస్సీ కాదు.. పద్మశాలి

**నిరూపించేందుకు నేను సిద్ధం : మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి దళితుడు కాదని, పద్మశాలీ అని దానిని నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే జైలుకైనా వెళ్లేందుకు రెడీగా ఉన్నానని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఆయన పుట్టు పూర్వోత్తరాలు అదే గ్రామానికి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మంద కృష్ణమాదిగ, మోత్కుపల్లి నర్సింహులు తర్వాత తనకు తెలుసన్నారు. కానీ, ఆయన దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్లు అక్రమంగా పొందుతున్నారని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కడియం ఎస్సీనే కాదు అలాంటప్పుడు ఆయన బిడ్డ కావ్య ఎస్సీ ఎలా అవుతుందని రాజ య్య ప్రశ్నించారు. కావ్య ముస్లిం వ్యక్తిని పెండ్లి చేసుకొని శ్రీహరి వారసులమని చెప్తున్నదన్నారు. నక్కజిత్తుల కడియంతో ఏ దళిత నాయకుడూ బాగుపడలేదని, కులం పేరు చెప్పుకొని మోసం చేస్తున్న కావ్యను వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు.



దుగ్గొండిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి మాలోత్ కవిత

## ఎంపీగా గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా..

**మానుకోట అభ్యర్థి మాలోత్ కవిత**

**సీఎం, ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేదు :**

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

నర్సంపేట/ఖానాపురం/నల్లబెల్లి, ఏప్రిల్ 20: తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రశ్నించే గొంతుకనవుతానని బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం మండలకేంద్రాల్లో మానుకోట పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ద సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లేయించుకుందన్నారు. కానీ వంద రోజుల్లోనే ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత మొదలైందన్నారు. మహబూబాబాద్ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహిస్తామని చెప్పి.. కేవలం ఐదు వేల మందితో సభ జరిగిందని ఎద్దేవా చేశారు. సభకు జనాలు లేకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ స్వయంగా రోడ్లపై ఉన్న ప్రజలను సభాస్థలికి తీసుకెళ్లారని విమర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ కష్టాలొస్తాయన్నారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పెద్ది మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను తీసుకొచ్చిన పనులన్నీ పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే దొంతికి ఈ టర్మ్ సరిపోదని విమర్శించారు. కాంగ్రెస్ పాలన ఇలాగే ఉంటే ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మధ్య సఖ్యత లేదనే విషయం మహబూబాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సభతో ప్రజలకు తెలిసిపోయిందని, ఎమ్మెల్యే దరఖాస్తులు గిర్నిబావి కూడా దాటడం లేదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మానుకోట బహిరంగ సభతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన 'ఖేల్ ఖతం.. దుకాణం బంద్' అని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. ఆయాచోట్ల సమావేశాల్లో జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, వరంగల్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ కోమలా భద్రయ్య, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామీనాయక్, ఎంపీపీ ప్రకాశ్‌రావు, మండల అధ్యక్షులు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో అభివాదం చేస్తున్న అభ్యర్థి సుధీర్‌కుమార్

# కడియం.. అభినవ కట్టప్ప

**నమ్మకానికి, నమ్మకద్రోహానికి మధ్య పోటీ**

**నయవంచకుడు శ్రీహరికి ఎన్నికల్లో బుద్ధిచెప్పాలి**

**ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

**వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్సే**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**పరకాలలో నియోజకవర్గ స్థాయి సమావేశం**



పరకాల, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్‌లో ఎంపీగా, డిప్యూటీ సీఎంగా, రెండు సార్లు ఎమ్మెల్సీ పదవులు అనుభవించి బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నమ్మకద్రోహం చేసిన కడియం శ్రీహరి అభినవ కట్టప్ప అని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఇవి నమ్మకానికి, నమ్మకద్రోహానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని.. ఎంతోమంది రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసిన నయవంచకుడు కడియంకు బుద్ధిచెప్పేలా ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం పరకాల శివారులోని లలిత కన్వెన్షన్ హాల్‌లో పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నియోజకవర్గ సమన్వయకర్త, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు.

**రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే : మాజీ మంత్రి ఎర్రబెల్లి**

తప్పుడు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడేవన్నీ అబద్ధాలేనని, ఆగస్టు 15న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయకపోతే ప్రభుత్వాన్ని డిసాల్వ్ చేసి మళ్లీ ఎన్నికలకు వస్తావా? అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి హామీలను పక్కన పెట్టాడని, ఇప్పటికే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో భూముల ధరలు ఎంతో పెరిగాయని, రేవంత్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని కంపెనీలు తరలిపోవడంతో పాటు భూముల రేట్లు సగానికి పడిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఓడగొట్టి తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కడియం బీఆర్ఎస్‌ను మోసం చేశాడని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి కిషన్‌రావు, వాసుదేవారెడ్డి, శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

**దళితులను మోసం చేస్తున్న కడియం : మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

కడియం దళిత సమాజాన్ని మోసం చేస్తున్నాడు. దళిత దొరగా పేరు పొందిన కడియం ముందు తన కులంపై వివరణ ఇవ్వాలి. కుట్రలు, కుతంత్రాలకు మారుపేరుగా నిలిచిన కడియంకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు.

**ఇద్దరు ఒక కోవకు చెందిన వారే : సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి**

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కడియం కావ్య, అరూరి రమేశ్ ఒకే కోవకు చెందిన వారు. తెలంగాణ సాధకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై ఆలోచించి ఓటు వేయాలి. బీఆర్ఎస్ గెలిస్తేనే మోసపూరిత రాజకీయాలకు స్వస్తి.

**మోసగాళ్లకు ఓటుతో సమాధానం చెప్పాలి :**
**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

మోసగాళ్లకు ఓటుతోనే సమాధానం చెప్పాలి. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ బీఆర్ఎస్‌ను మోసం చేసిండ్లు. వీరిపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఇంటింటా ప్రచారం చేయాలి. వరంగల్‌లో సుధీర్‌కుమార్ గెలుపును ఎవరూ ఆపలేరు.

## మూడో రోజు నాలుగు

**వరంగల్‌లో 4, మహబూబాబాద్‌లో నిల్**

**ఇప్పటివరకు రెండు స్థానాలకు దాఖలైన నామినేషన్లు 16**

వరంగల్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ)/మహబూబాబాద్ : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు మూడవ రోజైన శనివారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేయగా మహబూబాబాద్‌లో ఎవరూ నామినేషన్ వేయలేదు. వరంగల్‌లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్, ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా మాస సావిత్రి, స్వతంత్ర అభ్యర్థిగా గారెపాక అనిల్‌కుమార్ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్యకు అందజేశారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ శనివారం మరో సెట్ దాఖలు చేశారు. ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ మొదలుకాగా వరంగల్ స్థానానికి ఇప్పటివరకు తొమ్మిది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు, మహబూబాబాద్‌లో నలుగురు అభ్యర్థులు 5 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నామినేషన్లు వేయనున్నారు.